



RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 121 | శుక్రవారం 6 - 6 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 121 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 6 FRIDAY JUNE 2025 PAGES : 8 Rs :2-00


## ఈ గొప్ప అవకాశం నాకే దక్కింది

### తన నివాసంలో 'సిందూర' మొక్క నాటిన ప్రధాని



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో 'సిందూర' మొక్కను నాటారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళా బృందం ఇచ్చిన ఈ మొక్కను..పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాటారు. అందుకు సంబంధించిన ఫొటోలను 'ఎక్స్' వేదికగా పంచుకున్న ఆయన ప్రత్యేక పోస్టు పెట్టారు."బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో కచ్‌కు చెందిన తల్లులు, సోదరీమణులు తమ వీర పరాక్రమాలను ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్‌లో పర్యటన చేసిన సమయంలో ఆ మహిళా బృందం నన్ను కలిసింది. అప్పుడే వారు నాకు ఈ మొక్కను అందించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. ప్రధానమంత్రి నివాసంలో ఈ మొక్కను నాటే గొప్ప అవకాశం నాకు దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మొక్క మన దేశ మహిళా శక్తి, శౌర్యం, స్ఫూర్తికి బలమైన చిహ్నంగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ పోస్టు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను జత చేశారు.కాగా.. పహల్గాంలో ఉగ్రవాదులు మహిళల నుదుటి సిందూరాన్ని తుడిపేశారు. ఈ ఘటన తర్వాత ప్రతీకారానికి సిద్ధమైన భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌పై దాడులు నిర్వహించింది. ఈ క్రమంలోనే 1971 యుద్ధంలో భాగమైన మహిళా బృందం ప్రధానికి 'సిందూర' మొక్కను బహూకరించింది. మోదీ మొక్క నాటుతున్న ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## సోషల్ మీడియా పోస్టు.. ఆర్సీబీ యాజమాన్యంపై విచారణ..!




న్యూఢిల్లీ : ఆర్సీబీ విజయోత్సవాల వేళ సంభవించిన తొక్కిసలాట ఘటన పెను విషాదాన్ని నింపింది. ఈ ర్యాలీ గురించి ఆర్సీబీ యాజమాన్యం తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టి, వరుస అప్‌డేట్లు ఇచ్చింది.ఈ పోస్టు విషయంలో ఆ ఫ్రాంఛైజీ యాజమాన్యం దర్యాప్తును ఎదుర్కోనుంది. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ సీనియర్ సభ్యులను ఈ విచారణలో ప్రశ్నించనున్నారు. సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో క్రికెట్ సంఘం పాత్రను ఇప్పటికే మెజిస్టీరియల్ ప్యానెల్, బెంగళూరు పోలీసులు సమీక్షిస్తున్నారు .బుధవారం ఉదయం ఆర్సీబీ తన అధికారిక ఖాతాలో విజయోత్సవ ర్యాలీ గురించి పోస్టు పెట్టింది. మధ్యాహ్నం 3.14 గంటల వరకు దానిపై అప్‌డేట్లు ఇచ్చింది. అందరూ రోడ్‌షోను ఎంజాయ్ చేసేలా.. పోలీసులు, ఇతర అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని క్రికెట్ అభిమానులను అభ్యర్థించింది. విధానసౌధ, చిన్నస్వామి స్టేడియం వద్ద అభిమానులు పోటెత్తడానికి ఈ పోస్టు కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి. మరోపక్క ఈ ర్యాలీ విషయంలో భద్రత గురించి సిటీ పోలీసులు ఆందోళన వ్యక్తంచేశారు. దానిని ఆదివారానికి వాయిదా వేసుకోవాలని ఆర్సీబీ యాజమాన్యం, ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆటగాళ్లు, ముఖ్యంగా విదేశీ క్రికెటర్లు అప్పటివరకు అందుబాటులో ఉండరన్న కారణంతో నిన్ననే ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో జరిగిన తొక్కిసలాట కారణంగా ఆర్సీబీ జట్టు కప్ ఆనందం కొన్ని గంటల్లో ఆవిరైంది. పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. కాగా.. దీనిపై బెంగళూరు సిటీ పోలీస్ విభాగం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# గత సీఎం హెలికాప్టర్‌లో వెళుతుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవి: చంద్రబాబు సెటైర్

### అనంతవరంలో మొక్కలు నాటిన సీఎం చంద్రబాబు

### గత ప్రభుత్వంలో పర్యావరణ పరిరక్షణ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ



అమరావతి: గత వైసీపీ ప్రభుత్వం చెట్లను నరికివేయడమే పనిగా పెట్టుకుందని, వారికి చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలపై కనీస అవగాహన లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని నరికివేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇవాళ రాజధాని ప్రాంతంలోని అనంతవరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, గత ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవని సెటైర్ వేశారు. కానీ ఇప్పుడు తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తున్నప్పుడు ఒక్క చెట్టు కూడా నరకడం లేదని ప్రజలు గమనించాలని కోరారు.కొన్ని దేశాల్లో చెట్లను నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారని, చెట్టు నరకాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని చంద్రబాబు గుర్తుచేశారు. చెట్టు నరికితే మనిషిని చంపినంత నేరంగా పరిగణించి చర్యలు తీసుకునే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. "చెట్లు పెంచడం మనందరి బాధ్యత. చెట్లు నరకడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని ఆయన పేర్కొన్నారు.

**అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా... మరి మొక్కలు నాటే బాధ్యత లేదా?**

రానున్న నాలుగైదు సంవత్సరాల్లో రాష్ట్రంలో కనీసం 37 శాతం పచ్చదనం ఉండేలా చూడాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం ఉద్యానవన పంటల (హార్టికల్చర్) అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయంలో పవన్ కల్యాణ్ కూడా స్పష్టమైన సూచనలు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం పది మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. "అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా? మరి మొక్కలు నాటే బాధ్యత మనపై లేదా?" అని ప్రజలను ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన రావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో గ్లోబల్ వార్మింగ్ ఒకటని, దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వర్షాలు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో సాగు ప్రమాదంలో పడుతోందని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తి ఫ్లోరైడ్ సమస్యలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు. చిన్నప్పుడు చదువుకున్న కథను గుర్తుచేస్తూ, "ఒక వృద్ధుడు తన తర్వాతి తరాల కోసం చెట్టు నాటినట్లు, మనం కూడా భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటాలి. స్వార్థంతో బతకడం కాదు, విజ్ఞతతో ప్రవర్తించాలి," అని హితవు పలికారు. పద్మశ్రీ వనజీవి రామయ్య వంటి వ్యక్తులు మనకు ఆదర్శమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

# బహుశా ఆయనకు ఉన్నంత అర్హత నాకు లేదేమో!: పవన్ కల్యాణ్




అమరావతి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు అమరావతి ప్రాంతంలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిగా వచ్చే ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్రంలో కనీసం కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన ప్రకటించారు. అడవుల్లో కార్చిచ్చులను నివారించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.ఈ సందర్భంగా పర్యావరణవేత్త కుమెర అంకారావు సేవలను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "14 ఏళ్ల వయసులో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఒక పక్షి చనిపోవడం చూసి చలించిపోయి, మూడు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణకు అంకితమైన కుమెర అంకారావు గారి నిబద్ధత ప్రశంసనీయం. ఆయనకున్నంత అర్హత బహుశా నాకు లేదేమో అనిపిస్తుంది" అంటూ పవన్ వినమ్రంగా వ్యాఖ్యానించారు. నల్లమల అడవుల పరిరక్షణ కోసం అంకారావు చేస్తున్న కృషి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అటువంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, అధికారులకు పవన్ ధన్యవాదాలు తెలియజేశారు.పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "చెట్టు-నీరు" వంటి కార్యక్రమాల ద్వారా చంద్రబాబు పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని, ఆయన మార్గదర్శకత్వంలో పర్యావరణ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. "ప్రస్తుతం అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు నా వద్ద ఉన్నాయి. వచ్చే ఏడాది ఇదే సమయానికి కోటి మొక్కలు నాటడమే కాకుండా, అడవుల్లో కార్చిచ్చులను అరికట్టి, గొర్రెలు, మేకల కాపరులకు అవగాహన కల్పించి, అడవుల నరికివేతను తగ్గించి, అప్పుడు మరింత అనుభవంతో మీ ముందుకొచ్చి మాట్లాడతాను" అని పవన్ కల్యాణ్ అన్నారు.చెట్లు మన జీవితంలో ఎంత కీలకమో వివరిస్తూ, "ఒకప్పుడు ఇళ్లకు దారి చెప్పాలంటే మర్రిచెట్టునో, గోరింటాకు చెట్టునో ఆనవాలుగా చెప్పేవాళ్ళం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెట్లు లేని జీవితాన్ని ఊహించుకోలేం. అవి కేవలం పక్షులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఆధారం" అని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం పచ్చదనం సాధించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి గారు మా అందరికీ రాష్ట్రంలో 33 శాతం కాకుండా, 50 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని లక్ష్యం నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను పర్యావరణ పరిరక్షణలో, అటవీ సంరక్షణలో, నగర వనాల్లో తలమానికంగా నిలపడానికి మనమందరం కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చే సూచనలు, సలహాలు స్వీకరించి, వచ్చే ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుని ఆయన మెప్పు పొందేలా పనిచేస్తామని పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## శర్మిష్ఠ పనోలీకి ఊరట... మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కలకత్తా హైకోర్టు



న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై అరెస్ట్ అయిన కోల్‌కతాకు చెందిన 22 ఏళ్ల సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలీకి కలకత్తా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. శర్మిష్ఠ అరెస్టుకు కారణమైన వజహత్ ఖాన్ ఖాద్రీ అనే వ్యక్తిపైనే కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే, పహల్గామ్ దాడి తర్వాత భారత సైనిక చర్యను ప్రశ్నిస్తూ వచ్చిన ఒక పోస్టుకు ప్రతిస్పందనగా శర్మిష్ఠ పనోలీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన రెండు వారాలకు పైగా సమయం తర్వాత, మే 31న ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. శర్మిష్ఠ పనోలీని గతవారం గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు, కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.శర్మిష్ఠ పనోలీ అరెస్ట్ పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ దుమారాన్ని రేపింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాయి. ఈ వివాదం అంతర్జాతీయంగా కూడా దృష్టిని ఆకర్షించింది. నెదర్లాండ్స్ పార్లమెంట్ సభ్యుడు, రైట్-వింగ్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ నాయకుడు గీర్ట్ వైల్డర్స్ కూడా శర్మిష్ఠకు మద్దతు తెలిపారు. ఇన్ ఫ్లుయెన్సర్ అరెస్టు "స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణకు అవమానం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆమెను విడుదల చేసేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.

## జగన్.. మీ తీరు మారకపోతే ఈసారి మిగిలేది ఒక్కటే: రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం: వైకాపా అధినేత జగన్.. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. వైకాపా ప్రభుత్వం చెయ్యలేని ఎన్నో పనులను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసి చూపించిందని అన్నారు.శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " ఏడాదిలో దురుద్దేశ ఆందోళనలు తప్ప నిర్మాణాత్మక సూచనలు చేశారా? రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలి. పెట్టుబడులు రాకూడదన్నది జగన్ ఆలోచన. రాష్ట్రానికి జగన్ తీరని ద్రోహం చేశారు. అందుకే ప్రజలు ఆ పార్టీని 11కే పరిమితం చేశారు. జగన్ తీరు మార్చుకోకపోతే 11లో ఈసారి మిగిలేది ఒకటే" అని రామ్మోహన్ నాయుడు ఎద్దేవా చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



బాపట్ల,జూన్ 05 ( రాయల్ జర్నలిజం) ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం బాపట్ల మండలం సూర్యలంక దగ్గర నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఆప్కో చైర్మన్ డా. సజ్జల హేమలత, జిల్లా అటవీ శాఖ అధికారి కె. వినోద్ కుమార్, జిల్లా అధికారులు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి. గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అధికారులు నగరవనంలో చెట్లను నాటారు. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజా ప్రతినిధులు,అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, మొక్కలను నరికి వేయడం వలన ప్రపంచంలో ఒక తీవ్రమైన పరిస్థితి ఏర్పడిందని అదే గ్లోబల్ వార్మింగ్ అని ఆయన అన్నారు. గ్లోబల్ వార్మింగ్ వలన సునామి లాంటివి ఏర్పడ్డాయని అన్నారు. వర్షాకాలంలో ఎండలు, ఎండాకాలంలో వర్షాలకు కారణం గ్లోబల్ వార్మింగ్ అని ఆయన అన్నారు. భూమాత మానవునికి కావలసిన అన్ని సౌకర్యాలు ఇచ్చిందని ఆయన తెలిపారు. మానవుడు స్వార్థంతో ఆ వనరులన్నింటినీ నాశనం చేస్తున్నాడని ఆయన అన్నారు. యునైటెడ్ నేషన్ లో సస్టైన్ డెవలప్మెంట్ రూల్స్ లో 17 సూత్రాలు ఉన్నాయని, అందులో ఏడు సూత్రాలు పర్యావరణ సంబంధించినవేనని ఆయన అన్నారు.ఆంధ్రప్రదేశ్ లో 21% మాత్రమే అడవులు ఉన్నాయని ఆయన అన్నారు. బాపట్లలో కేవలం 9.84% మాత్రమే ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవలసిన అవసరం ఉందని



తెలిపారు.అదే విధంగా కాలుష్యాన్ని నివారించడం, పర్యావరణ సమతుల్యతను నిర్వహించడం లక్ష్యాలుగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ ఏడాది "ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే అంశం తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో కృషి జరుగుతోందని, ఇందులో మనమందరం భాగస్వాములు కావాలని ఆయన అన్నారు.ప్లాస్టిక్ కాలుష్యం వల్ల పర్యావరణ పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆయన అన్నారు.ప్లాస్టిక్ ని జీవన శైలి నుండి నిషేధించుకోవడం చాలా అవసరమని తెలిపారు. దీనిని నివారించే చర్యలు చేపట్టాలని అన్నారు. ప్లాస్టిక్ వలన నీటి కాలుష్యం తో పాటు భూగర్భ జలాలు కూడా తగ్గిపోతున్నాయన్నారు. మన శరీరంలో కూడా ప్లాస్టిక్ చేరిపోయి వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులు రావడానికి కారణం అవుతోందన్నారు.ఇది ఇలాగే కొనసాగిస్తే సహజ వనరులు పూర్తిగా దెబ్బ తినే అవకాశం ఉందని ఆయన అన్నారు. 1850వ సంవత్సరంలో పారిశ్రామిక విప్లవం అనేది యూరప్ లో మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు సుమారు 3 డిగ్రీల పైగా భూమి ఉష్ణోగ్రత పెరిగిందని చెబుతున్నారని ఆయన అన్నారు. దీనికి పరిశ్రమలు కారణమైతే అడవులను నరికి వేయడం, పచ్చదనాన్ని తొలగించడం అనేది ప్రధానమైన కారణమని ఆయన అన్నారు. దీనిని తగ్గించుటకు పరిశ్రమలను తొలగించలేమని, అభివృద్ధి కావాలని ఆయన అన్నారు. మనం వాడుతున్నటువంటి బొగ్గును, బొగ్గును మండించడం ద్వారా విద్యుత్ సరఫరా చేయడాన్ని, డీజిల్ వినియోగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ ఈరోజు మనం పర్యావరణానికి ఎటువంటి ఇబ్బంది, హాని కలగకుండా సోలార్, విండ్, హైడ్రా, హైడల్ పవర్ కు వస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పరిస్థితులను తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరు విరివిగా చెట్లు నాటి వాటిని పరిరక్షించాలని ఆయన తెలిపారు. ప్రజలందరూ వారింట్లోని చెత్తను తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకల చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని తెలిపారు. సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఎస్ డబ్ల్యు పిసి కేంద్రాలలో వేయాలని ఆయన తెలిపారు. జిల్లాలోని 477 పంచాయతీలలో సోలార్ సిస్టం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవడమైనదని ఆయన తెలిపారు. ఈ విధంగా పర్యావరణాన్ని



కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేలా మనందరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ పర్యావరణం పై గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అటవీ శాఖ వారు జ్ఞాపికలను బహుకరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, స్వయం సహాయక గ్రూపు సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లరేవు ఎంపీపీ ని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా పరిషత్ స్కూల్ హెచ్ ఎం



తాళ్లరేవు జూన్ 5: తాళ్ళరేవు మండలం పటవల గ్రామ పంచాయతీ ఆధీనంలో శ్రీమతి, శ్రీ పోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన ప్రధమ ఉపాధ్యాయునిగా వచ్చినటువంటి స్కూల్ హెచ్ఎం సలాది వెంకట నారాయన్, తాళ్ళరేవు మండల ఎంపీపీ రాయుడు సునీత గంగాధర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం రాయుడు సునీత గంగాధర్ కు శాలువాతో సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మేడిశెట్టి శివ ప్రసాద్ టిడిపి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భజన సత్తిబాబు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## ఇంటి చుట్టూ వనం ఊరంతా ఉద్యానవనం లా తయారు చేసుకోవాలి




చీరాల,జూన్ 05( రాయల్ జర్నలిజం)ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా చీరాల పట్టణం బాయ్స్ హై స్కూల్ నందు యువ నాయకులు గౌరీ అమర్నాథ్ మానవహారం, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యువ నాయకులు అమర్నాథ్ మాట్లాడుతూ మానవ ఆవాసానికి మానవ జీవితానికి మరియు సకల ప్రాణుల మదుగుడకు ప్రకృతి ఎంతో ఆవశ్యకమైనది. ప్రకృతికి జీవుల మనుగడకు ఎంతో ఆత్మీయ అవినాభావ సంబంధం ఉంది. మనం పీల్చే గాలి నుండి తాగే ప్రతి నీటి చుక్కను ప్రతిదీ ప్రకృతి నుండి మనకు లభించినదే. ప్రకృతి లేనిదే జీవుల మనుగుటలేదు. జీవుల మనుగుడ లేనిదే మానవ మనుగుడా అసలు లేదు. జీవ వైవిద్యం దెబ్బతింటే మొత్తం సృష్టికి ప్రమాదం ఏర్పడుతుంది. పెరుగుతున్న జనాభా తరుగుతున్న వనరులు తద్వారా మనిషికి అత్యాశకు స్వార్థం ముదిరి ప్రకృతిలోని సమతుల్యతను దెబ్బతీస్తుంది. కర్బన ఉద్గారాల వినియోగం రోజురోజుకు పెరుగుతా ఉంది అడవుల ధ్వంసం చెట్లను నరికి వేయడం ఎక్కువగా జరుగుతా ఉంది తద్వారా ప్రకృతిలో తగినంత మోతాదులో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి మనకు వివిధ రోగాలకు కారణమవుతోంది ఆ ప్రభావం పంటల మీద కూడా పడుతూ ఉంది. కావున ఈరోజే మనం ఈ ఆవశ్యకతను గుర్తించి ప్రతి మనిషి పది మొక్కలకు తగ్గకుండా పెంచడం అలవాటు చేసుకోవాలి ఇంటి చుట్టూ వనం ఊరంతా ఉద్యానవనం లా తయారు చేసుకొని తిరిగి మనం ప్రకృతితో స్నేహం చేస్తూ ప్రకృతికి





తగిన జీవజవాలను మనం అందించడానికి మన వంతు సంపూర్ణ సహాయం చేయడానికి మనమందరం కృషి చేయాలి గతంలో పర్యావరణం శాస్త్రవేత్తలు చెప్పినట్టుగా 33 శాతం అడవులు ఉండేది క్రమక్రమంగా వర్షపాతం వల్ల మడ అడవులు చాలావరకు తగ్గుముఖం పట్టినవి కొన్నిచోట్ల చెట్లను నరకడం వివిధ రకాలుగా కలపను వాడుకోవడం మానవుడికి పరిపాటిగా మారింది కావున అటువంటి చర్యలు మనం మానుకొని ప్రకృతిని ప్రేమించడం ప్రతి ఒక్కరు కర్తవ్యం గా భావించి పర్యావరణానికి తగినంత స్వేచ్ఛను మనం కల్పించినట్ల యితే కన్నతల్లిలా ప్రకృతి మనలను మన జీవితాలను జీవుల మనుగడను కాపాడుతుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రషీద్ గారు, మున్సిపల్ సిబ్బంది, మరియు అధికారులు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## పి-4 పురోగతి సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం

బాపట్ల ల,జూన్ 05( రాయల్ జర్నలిజం) పి-4 మార్గదర్శిల నమోదులో బాపట్ల జిల్లా 60 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పి-4, యోగాంధ్ర, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. మార్గదర్శిలతో గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి పి-4 అమలుపై ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు మూడు వేలమంది మార్గదర్శిలు పి-4లో నమోదైనట్లు చెప్పారు. బంగారు కుటుంబాలను మార్గదర్శిలు ఎంపిక చేసుకోవడం, దత్తత చూసుకోవడంపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో, తహసిల్దార్, డిప్యూటీ ఎంపీడీవో, డిప్యూటీ తహసిల్దార్, వెలుగు ఏపీఎంలు కమిటీగా ఏర్పడి సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత మండల స్థాయి అధికారులపై ఉందన్నారు. ముందుగా ఏడాది వార్షికాదాయం రూ.50 లక్షలకు మించి, చట్టబద్ధంగా పన్ను చెల్లించే వారినే మార్గదర్శిలుగా నమోదు చేయాలన్నారు. ముందస్తుగా బంగారు కుటుంబాలకు అవసరతలు, సహాయం ఎలా కావాలో, ఎలాంటి సహాయం కోరుతున్నారో గుర్తించి, మార్గదర్శిలతో అనుసంధానించాలన్నారు. తద్వారా మార్గదర్శిలు ఎలా సహాయం చేస్తున్నారో, బంగారు కుటుంబాలకు అవసరతలు తీరుతున్నాయా, మరి ఏదైనా అవసరం ఉందేమో అనే



అంశాలపై దస్త్రాలలో పొందుపరచాలన్నారు. అలాగే మార్గదర్శిలు, బంగారు కుటుంబాలను అనుసంధానిస్తూ గ్రామ స్థాయిలో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. బల్లికురవ, జెపంగులూరు మండలాలలో నూరు శాతం మార్గదర్శిల నమోదు పూర్తి చేయడంపై సదరు అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. యువ జనాభా పెరుగుదల కొరకు ఏపీలో పిల్లలను కనడంపై రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రజాభిప్రాయ సేకరణ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారత్ జిడిపి ఏడు శాతం ఉండటంతో ప్రపంచంలోనే నాల్గొవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. ఈ నేపథ్యంలో సంపదను సమకూర్చుకోవడానికి యువత కొరత ఉందన్నారు. అందుకే పిల్లల జననాల నిష్పత్తి పెరగాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడ అడవుల మొక్కలు నాటడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జులై నెలలో బాపట్ల జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెప్పారు. ఐటిసి కంపెనీ 80,000 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుండగా, ఆ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి 70 కిలోమీటర్ల బాపట్ల తీర ప్రాంతం వెంబడి మడ అడవుల మొక్కలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. సముద్రతీర ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 86 వేల ఎకరాలలో కేవలం మడ అడవుల మొక్కలు నాటాలని కేంద్రం మార్గ నిర్దేశం చేసిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో బాపట్ల జిల్లా నుంచి 5.24 లక్షల మంది ప్రజలు సభ్యులుగా నమోదయాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మరొక 70 వేల మందిని సభ్యులను చేర్చాలని ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాలలో బాపట్ల జిల్లా ఏడో స్థానంలో నిలిచిందన్నారు. ప్రతి గ్రామంలో యోగాంధ్ర ర్యాలీలు ఈనెల ఆరవ తేదీన నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఇప్పటివరకు 111 మంది ట్రైనర్లకు సమర్థంగా శిక్షణ ఇచ్చామన్నారు. మరో 79 మందిని ఎంపిక చేసి త్వరగా శిక్షణ పూర్తి చేయాలన్నారు. 2,800 ప్రాంతాలలో శిక్షణ నిర్వహించే వేదికలను ఎంపిక చేసినట్లు వివరించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో సిపిఓ శ్రీనివాసరావు, డ్వామా పిడి విజయలక్ష్మి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, డిఇఓ పురుషోత్తమరావు, తదితరులు పాల్గొన్నారు.

## పశు సంరక్షణ గో సంరక్షణ సమాజ బాధ్యత




బాపట్ల,జూన్ 05 ( రాయల్ జర్నలిజం)భావపురి బ్రాహ్మణ సమాఖ్య, విశ్వ హిందూ పరిషత్ సంయుక్తంగా కార్యకర్తల సమావేశంలో భావపురి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు నిభానుపూడి శ్రీహరి ప్రకాష్ మాట్లాడుతూ రానున్న బక్రీదు పండుగ సందర్భంగా జరిగే జంతువధ నుండి పాడి పశువులను ఆవులను కోడెలు ఎద్దులను కాపాడే భాగంగా జిల్లా అధికారులు ఉత్తరువులు జరీచేశారని,ఈ విషయంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించవలసిందిగా జిల్లాలలోని గ్రామపంచాయతీ సర్పంచి, గ్రామ పెద్దలను, పూజారులను, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలును కోరారు.భావపురి బ్రాహ్మణ సమాఖ్య కార్యదర్శి సోమరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా అడవి పంచాయతీలోని కప్పల వారి పాలెం గ్రామంలో గోశాలను రైతులు గో భక్తులు సందర్శించి వాటిని వినియోగించుకుంటూ తమ సహాయ సహకారాలు అందించవలసిందిగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంత గోరక్ష సహ ప్రముఖ మన్నవ చలపతిరావు భావపురి బ్రాహ్మణ సమఖ్య ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి నారాయణ, కోశాధికారి పూసపాటి శ్రీకాంత్, సభ్యులు పులిగడ్డ వెంకట కోదండ రామారావు, ఆలూరి నాగరాజ్, మంచికంటి రఘురాం, సాయి, బాబు నాగేంద్ర, పోలూరి ప్రసాద్, హరి పండిట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ప్రభుత్వం సంచలన నిర్ణయం.. ఇక అర్ధరాత్రి ఆన్‌లైన్ గేమింగ్ ఆడలేరు!

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా ఆన్‌లైన్ గేమింగ్ దేశంలో బాగా ప్రాచుర్యం పొందింది. కానీ తమిళనాడులో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం కష్టంగా మారింది. ఇప్పుడు గేమర్‌లు అర్ధరాత్రి 12 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు గేమ్‌లోకి లాగిన్ అవ్వలేరు. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమర్‌లను కఠినంగా నియంత్రించడానికి కొత్త చట్టాన్ని రూపొందించింది. దీని కోసం ప్రభుత్వం రాష్ట్రంలో తమిళనాడు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ నిబంధనలు, 2025ని అమలు చేసింది. దీని కింద గేమర్‌లు అర్ధరాత్రి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడలేరు. మద్రాస్ హైకోర్టు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. ఆటలో డబ్బు సంపాదించడానికి రుణాలు తీసుకొని కూడా ప్రజలు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడతారు. దీని దుష్ప్రభావం ఏమిటంటే గేమర్‌లు అప్పుల ఉచ్చులో చిక్కుకుంటారు. అలాగే, ఆధార్ ఆధారిత %ఖ్జ% ధృవీకరణ చేయించుకోవడం తప్పనిసరి. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యపై మద్రాస్ హైకోర్టు స్పందించింది. ఏ చర్యలు తీసుకున్నారో, భారతదేశంలో గేమింగ్ పరిశ్రమ ఎంత పెద్దదో తమకు తెలియజేయాలని పేర్కొంది.

**ఖాళీ సమయాల్లో ఆన్‌లైన్ ఆటలపై నిషేధం!**

తమిళనాడు ప్రభుత్వం ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్‌లపై విధించిన నిబంధనలను మద్రాస్ హైకోర్టు ధృవీకరించింది. ప్రభుత్వం అర్ధరాత్రి 12 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు అలాంటి గేమ్‌లను నిషేధించింది. దీని అర్థం ఇప్పుడు గేమర్‌లు ఖాళీ సమయాల్లో ఆన్‌లైన్ గేమ్‌లను ఆడలేరు. దీనితో పాటు, గేమర్‌లు ఇప్పుడు గేమ్స్ ఆడటానికి ఆధార్ ఆధారిత %ఖ్జ% ధృవీకరణ చేయవలసి ఉంటుంది.

**పిటిషనర్ వైపు**

తమిళనాడు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ నిబంధనలు, 2025 ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా, గోప్యతకు విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. ఐటీ చట్టం కిందకు వచ్చే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చట్టాలు చేయలేదని ఆయన అన్నారు. ఈ హక్కు కేంద్రానికి ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆమోదించిన ఇతర పత్రాలతో కూడా ధృవీకరణ సాధ్యమే కాబట్టి %ఖ్జ% కోసం ఆధార్ తప్పనిసరి చేయడం కూడా అన్యాయని పేర్కొన్నారు.

**కోర్టు ఏం చెప్పింది?**

పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చిన మద్రాస్ హైకోర్టు.. ప్రైవసీ హక్కు సంపూర్ణమైనది కాదని పేర్కొంది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సహేతుకమైన పరిమితులు విధించవచ్చు. ఖాళీ సమయాల్లో లాగిన్‌ను



నిషేధించడం తప్పనిసరి చర్య అని కోర్టు పేర్కొంది. ఈ సమయం సాధారణంగా నిద్ర, మానసిక విశ్రాంతి అవసరం. ఈ సమయంలో గేమింగ్‌ను అనుమతించడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ నియమం రాష్ట్ర పరిధిలో ఉందని వ్యాఖ్యానించింది.

**ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ విలువ రూ.30,747 కోట్లు:**

ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. భారతదేశంలో ఆన్‌లైన్ గేమింగ్ రంగం 2029 నాటికి రెట్టింపు అయి రూ.75,000 కోట్లకు చేరుకుంటుంది. ఇది ప్రధానంగా రియల్ మనీ గేమ్‌ల ఆధిపత్యంలో ఉంటుంది. శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన గేమ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ (జిడిసి)లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2024లో భారతదేశ ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ ఆదాయం రూ.30,747 కోట్లుగా ఉంటుందని, ఇందులో రియల్ మనీ గేమింగ్ విభాగం దాదాపు 86% వాటాను కలిగి ఉంటుందని పేర్కొంది.

# ఆ పన్ను శ్లాబ్ తొలగింపు.. తగ్గనున్న ధరలు.. కేంద్రం వద్ద కీలక ప్రతిపాదన!




హైదరాబాద్: వస్తు సేవల పన్ను శ్లాబుల్లో త్వరలోనే కీలక మార్పులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న నాలుగు పన్ను శ్లాబుల్లో ఒకదానిని రద్దు చేయాలనే ప్రతిపాదన జీఎస్టీ మండలి వద్ద ఉంది. దీనిపై వచ్చే సమావేశంలోనే దీనిపై నిర్ణయం వెలువడనున్నట్లు సమాచారం. మరి ఏ పన్ను శ్లాబు తొలగిస్తున్నారు? అందులోని వస్తువుల ధరలు తగ్గుతాయా? పెరుగుతాయా? అనే వివరాలు ఈ కథనం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) వ్యవస్థలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నాలుగు పన్ను శ్లాబులు అమలులో ఉన్నాయి. ఇందులో ఒక పన్ను శ్లాబును పూర్తిగా తొలగించే సూచనలు కనిపిస్తున్నాయి. నాలుగు ప్రధాన పన్ను శ్లాబుల్ల ఒకటైన 12 శాతం పన్ను శ్లాబును పూర్తిగా తొలగించే ప్రతిపాదనపై జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోనుంది. వచ్చే నెలలో జరగనున్న వస్తు సేవల పన్ను ( జీఎస్టీ) కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారని ప్రధాన మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే ఆ పన్ను శ్లాబులో ఉన్న వస్తువుల ధరలు తగ్గడం లేదా పెరగడం జరుగుతుంది. ధరలు తగ్గించేలా నిర్ణయం ఉండవచ్చని వార్తాల కథనాల ద్వారా తెలుస్తోంది.ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీ పన్ను శ్లాబులు 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం. 12 శాతం మధ్యస్థ రేటుగా ఉంది. అయితే, ఈ పన్ను శ్లాబును పూర్తి రద్దు చేసి అందులోని వస్తువులను 5 శాతం లేదా 18 శాతం శ్లాబుల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మార్పు వల్ల పన్ను వ్యవస్థ మరింత సరళతరం అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. 12 శాతం శ్లాబులోని వస్తువులను 5 శాతంలోకి మార్చితే వాటి ధరలు ఒక్కసారిగా తగ్గుతాయి. అయితే, 18 శాతానికి మార్చితే మాత్రం ధరలు భారీగా పెరుగుతాయి. కానీ, వస్తువుల, సేవల రకాన్ని బట్టి వర్గీకరణ చేసే అవకాశాలు ఉన్నాయి. చాలా వరకు 5 శాతంలోకి వచ్చేవే ఉన్నట్లు సమాచారం.జీఎస్టీ విధానం సరళీకరణపై ఇదే మొదటి ప్రయత్నం కాదు. గతంలోనూ పలుమార్లు ఈ విధంగా పన్ను శ్లాబుల సంఖ్య తగ్గించాలనే ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆదాయంపై ప్రభావం పడతుందనే ఆందోళనల నేపథ్యంలో పెద్ద ఎత్తున మార్పులు ఏం చేయలేదు. కానీ ఈ సారి ప్రతిపాదిత మార్పులు చేసేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొన్ని వస్తువులపై పన్ను తగ్గే అవకాశం ఉండగా, మరికొన్ని వస్తువులపై ధరలు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి వినియోగదారులకు, వ్యాపార వర్గాలకు దీని ప్రభావం ద్విదిశగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్రం, రాష్ట్రాలు కలిసి నిర్ణయాలు తీసుకుంటాయి. అందువల్ల ఈ ప్రతిపాదన అమలవ్వాలంటే సమగ్ర అంగీకారం అవసరం అవుతుంది. వచ్చే జులై నెలలో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో ఈ విషయంపై స్పష్టతనిచ్చే అవకాశముంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగే సమావేశానికి రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, అధికారులు హాజరవుతారు.

# పాము కాటుకు రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి..

అమరావతి : రెండు వాన చుక్కలు పడ్డాయంటే చాలు.. పాములు సంచారం పెరుగుతాయి. అంతవరకు పుట్టలలో, చిన్న చిన్న రంధ్రాల్లో, ఇటుకులు, చెక్కల ఇరుకున దాగి ఉండే పాములు.. వాన నీటికి ఆవాసం చెదిరి బయట సంచరిస్తూ ఉంటాయి. తమకు అనువైన కొత్త ఆవాసాలు కోసం అక్కడ.. ఇక్కడ తిరుగుతూ అన్వేషిస్తూ ఉంటాయి. అందుకే వానా కాలం వచ్చిందంటే చాలు బయట పాముల సంచారం ఎక్కువుగా ఉంటుంది. ఆ సందర్భంలోనే మనుషులపైన, ఇతర జంతువులపైన దాడి చేసి కరుస్తాయి. ఈ క్రమంలోనే శ్రీకాకుళం జిల్లాలో ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తుంది. గడిచిన మూడు రోజులు జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువుగా ఉన్నప్పటికీ అంతకు ముందు 4 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం అలుముకుంది. జిల్లాలో భారీగా వర్షం కురిసింది.శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పాములు దడ పుట్టిస్తున్నాయి. బయట వాటి సంచారం పెర గటంతో జిల్లా వాసులు అందరిలోనూ ఆందోళన మొదలైంది.

# దవాఖానలోని రోగులకు సర్జరీ చేసి ఇంజక్షన్ ఇచ్చారు.. కట్‌చేస్తే, నిమిషాల్లోనే ఆరుగురు విలవిలలాడుతూ..

న్యూఢిల్లీ : ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు ఇంజక్షన్ వికటించి చనిపోయారు. మృతులంతా వ్యవసాయ కూలీల కుటుంబాలకు చెందినవారు. రోగులు గత మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో కొందరికి సర్జరీలు కూడా జరిగాయి. సర్జరీ కూడా విజయవంతం అయ్యింది. ఈ క్రమంలోనే ఆరుగురు రోగులకు ఒకే బ్యాచ్‌కి చెందిన ఇంజక్షన్లు ఇవ్వగా, వాటిని వేసిన కొద్ది నిమిషాల్లోనే రోగులు ఊపిరి ఆడక విలవిలలాడిపోయారు. వెంటనే పరిస్థితి గమనించి ఐసీయూకు తరలించినా ప్రాణాలు నిలుపలేకపోయారు. విషయ తీవ్రతను గమనించిన ఆసుపత్రి సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు.కోరాపుట్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరుగురు మరణించిన ఘటనపై ఒడిశా ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సంబంధిత ఇంజక్షన్ బ్యాచ్‌ను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతానికి ఉన్నతాధికారులు ఆసుపత్రి డాక్టర్లు, నర్సుల్ని విచారిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు, మృతుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమవారు మృతిచెందారని బంధువులు ఆందోళనకు దిగారు.అధికారులు మృతుల బంధువులతో సంప్రదింపులు జరిపి మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహిస్తున్నారు. పది మంది వైద్య బృందం పోస్ట్ మార్టం ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యం పట్ల పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



**పోలీసుల మోహరింపు..**

పరిస్థితిని నియంత్రించడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసు సిబ్బందిని మోహరించారు. ఆసుపత్రి న్యాయమైన విచారణకు హామీ ఇచ్చినప్పటికీ, ఈ సంఘటన ఒడిశాలో ప్రజారోగ్య సంరక్షణ గురించి చాలా కాలంగా ఉన్న ఆందోళనలను మరోసారి తెరపైకి తెచ్చింది. దక్షిణ ఒడిశాకు కీలకమైన వైద్య సదుపాయమైన ఎస్ ఎల్ ఎన్ ఎం సి హెచ్, సిబ్బంది కొరత, అస్థిరమైన వైద్య విధానాలు, సరిపోని మౌలిక సదుపాయాలపై గతంలో విమర్శలను ఎదుర్కొంది.

# రోజూ సమాధి దగ్గర నిద్రపోతున్న శునకం.. అనుమానమొచ్చి ఆరా తీయగా..



అమరావతి : కుక్కలు విశ్వాసానికి మారుపేరుగా చెబుతారు. బుక్కెడు అన్నం పెట్టిన యజమానితో పాటు ఆ ఇంటిని కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటాయి. అందుకే అనేక మంది సొంత మనుషుల మీద కాకుండా కుక్కల మీదే ఎక్కువ నమ్మకం పెట్టుకుంటారు. యజమాని ఆపదలో ఉన్నాడని అందరికన్నా ముందు పసిగట్టేది ఆ ఇంటి కుక్కే. ఆపద సమయంలో తనకేమైతుందనేది చూసుకోకుండా యజమానిని కాపాడేందుకు ప్రాణాలను సైతం ఫణంగా పెడుతుంటాయి. అలాంటి ఓ పెంపుడు కుక్క.. తనను పెంచుతున్న యాజమాని చనిపోతే.. అతడి అంత్యక్రియల్లో పాల్గొని సమాధి వద్ద తిరుగుతూ, ఆ కుటుంబ సభ్యుల్ని కంటతడి పెట్టిస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన తాళ్లపల్లి కొమురయ్య అనే వ్యక్తి ఇటీవలే కారు ఢీకొన్న ఘటనలో చనిపోయాడు. శునకానికి రాజు అనే పేరు పెట్టుకున్నాడు. మృతుడు కొమురయ్య కుక్కను ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. కొమురయ్య ఇంట్లోంచి బయటకు ఎటు వెళ్లినా కూడా అతడితో పాటే వెళ్లేది శునకం. అయితే కొమురయ్య చనిపోవడంతో యజమాని కోసం సమాధి వద్దనే వేచి చూస్తోంది ఆ శునకం.సమాధి పక్కనే ఉన్న పాడే కట్టెల వద్ద కూర్చుని తన యజమాని కొమురయ్య ఎప్పుడు వస్తాడని దీనంగా ఎదురుచూస్తోంది. దీంతో కొమురయ్య కుటుంబ సభ్యులు విశ్వాసం గల శునకాన్ని చూసి కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. ఆస్తుల కోసం కొట్టుకుని, చంపుకునే ఈ రోజుల్లో మనుషుల కంటే జంతువులే నయమని నిరూపిస్తోంది రాజు అనే ఈ శునకం. అంతేకాకుండా అంత్యక్రియల్లో మొత్తం ఈ శునకం పాల్గొంది. మూడు రోజుల నుంచి సమాధి వద్దనే ఉంటుంది. అన్నం పెట్టినా కుక్క తినడం లేదు.

# చెత్త మధ్యన ఉన్నది ఏదో సాధారణ శిల్పం అనుకుంటే మీరు పొరపడినట్లే..

హైదరాబాద్: సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన గ్రామం బెజుగామలో వేర్వేరు కాలాలకు చెందిన జైన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుని రెండు శిల్పాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించారు. మొదటి శిల్పం గ్రామంలోని రాయ చెరువు వద్ద ఉంది. ఇది ధ్యాన ముద్రలో ఉన్న మహావీరుని శిల్పం. శిల్పంపై ఉన్న ఉష్ణీషం (తలపై ఆభరణం) అరుదైన కళాత్మకతతో ఆకర్షిస్తోంది. కోలముఖంతో కనిపించే ఈ శిల్పం 8వ లేదా 9వ శతాబ్దానికి చెందినది. ఇది బ్లాక్ కోరైట్ రాయిపై చెక్కబడింది. ఆ కాలానికి ప్రత్యేకమైన శిల్పకళను ప్రతిబింబిస్తుంది.రెండవ శిల్పం గ్రామంలోని హనుమాన్ ఆలయం పక్కన చెత్తలో పడి ఉంది. ఇది కొంత విరిగిపోయినా, 10వ లేదా 11వ శతాబ్దం శైలిలో



చెక్కబడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ శిల్పం గుండ్రని ముఖంతో, చిన్న ఉష్ణీషంతో ఉంది.బెజుగాం దేవుడు అనే జైనతీర్థంకరుడికి సంబంధించిన కళ్యాణీ చాళుక్యులు పాలించిన భువనైకమల్ల దేవర కాలానికి చెందిన శాసనాలు ఈ గ్రామంలో ఉన్నాయి. వీటిలో 1072 సంవత్సరానికి చెందిన ఒక శాసనమూ, మరొక శాసన శకలమూ ఉన్నాయి. శాసనంలో పేర్కొన్న బెజుగాం దేవుడు జైనతీర్థం కరుడే అయ్యుండవచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు.పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గ్రామస్తులకు పిలుపునిస్తూ, చెరువులో ఉన్న మహావీరుని శిల్పాన్ని నీటిలో మునిగిపోకముందే బయటకు తీసి సురక్షితంగా ఉంచాలని, తమ గ్రామ చరిత్రను సంరక్షించుకోవాలని సూచించారు. ఈ శిల్పాలు, శాసనాలు బెజుగామ చారిత్రక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

# కేసీఆర్ తాజా నిర్ణయంతో కవిత ఉక్కిరి బిక్కిరి..!

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కవిత లేఖ నుంచి వరుసగా జరుగుతున్న పరిణామాలు బీఆర్ఎస్ లో కలకలం రేపుతున్నాయి. కవిత తన అన్న కేటీఆర్ లక్ష్యంగా చేసిన వ్యాఖ్యల పైన కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరు బిడ్డల మధ్య వచ్చిన సమస్య పార్టీకి నష్టం చేయకూడదనే భావనతో ఉన్నారు. అందులో భాగంగా వ్యూహాత్మకంగా కేటీఆర్ విదేశీ పర్యటనకు వెళ్లారు. కవిత ఇప్పటి వరకు కేసీఆర్ తో మాట్లాడే ప్రయత్నం చేసినా అవకాశం దక్క లేదు. ఇక, తన విషయంలో కేసీఆర్ తాజా నిర్ణయాలు కవితను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

కేసీఆర్ వ్యూహం

కవిత వ్యవహారంలో కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరి స్తున్నారు. కవిత రాసిన లేఖ బయటకు వచ్చిన తరువాత చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. కేటీఆర్ పైన కవిత చేసిన పరోక్ష వ్యాఖ్యల కంటే బీజేపీలో బీఆర్ఎస్ విలీనా నికి ప్రయత్నం చేసారంటూ చెప్పిన అంశాలను కేసీఆర్ సీరి యస్ గా తీసుకున్నారని సమాచారం. దీంతో, తాజాగా హరీష్ ద్వారా బీఆర్ఎస్ ఏ పార్టీ తోనూ పొత్తు పెట్టుకోదని క్లారిటీ ఇప్పించారు. సింగిల్ గానే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని కేసీఆర్ మాటగా హరీష్ పార్టీ నేతలకు స్పష్టం చేసారు. అటు కేటీఆర్ ఇప్పటి వరకు కవిత వ్యవహారం పైన స్పందించ లేదు. కవితకు కేసీఆర్ నుంచి పిలుపు లేదు. తనకు తన త ండ్రి నుంచి పిలుపు వస్తుందని కవిత ఆశాభావంతో ఉన్నారు.

కవిత వెయిటింగ్

ఈ వివాదం మొదలై జరిగి పది రోజులు దాటినా కేసీఆర్ ఇంతవరకు కవితను పిలిచి మాట్లాడ లేదు.. సమయం కూడా ఇవ్వలేదు. కవిత కార్యక్రమాలకు బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్ దూరంగా ఉన్నారు. జాగృతి ఆధ్వర్యంలోనే కవిత తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేసీఆరే తన నాయ కుడు అంటున్నప్పటికీ.. బీఆర్ఎస్ కార్యకర్తలు దూరంగా ఉంటున్నారు. కేసీఆర్.. బీఆర్ఎస్ కాపాడుకోవటం తన లక్ష్యమని చెప్పినా.. కవితకు మద్దతుగా ఎవరూ వెళ్లకుండా నివారించటం లో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. అదే సమయంలో కేటీఆర్ కు అనుకూలంగా ఎక్కడా వ్యాఖ్యలు రాకుండా జాగ్రత్త పడ్డారు. కవిత పదే పదే తన తండ్రి పైన అభిమానం చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా, కేసీఆర్ మాత్రం మెత్తబడలేదు. కుమార్తెతో మాట్లాడేందుకు ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు.



పార్టీ మద్దతు లేని కవిత

కవితకు పార్టీ నుంచి మద్దతు లేకపోవటంతో కవిత ప్రస్తుతానికి తెలంగాణ జాగృతి ద్వారా కార్యక్ర మాలు నిర్వహించాలనే నిర్ణయంతోనే ఉన్నారని సమాచారం. తండ్రి నుంచి పిలుపు వచ్చినా, రాకున్నా.. తన పని తాను జాగృతి ద్వారా చేసుకుపోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, అటు కేటీఆర్ మరో నాలుగు రోజుల పాటు అమెరికాలోనే ఉండనున్నారు. ఈనెల 10న అమెరికా నుంచి కేటీఆర్ హైదరాబాద్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కేసీఆర్ 11న కాళేశ్వరం కమిషన్ విచారణకు వెళ్ళనున్నారు. దీంతో 10న హైదరాబాద్‌కు వచ్చేలా కేటీఆర్ ప్రణాళికలు చేసుకు న్నారు. కవిత వివాదం ఏ పరిస్థితుల్లోనూ స్పందించ వద్దని కేటీఆర్ కు కేసీఆర్ సూచించినట్లు సమాచారం. దీంతో, కవిత తన తండ్రి నిర్ణయం అంతు చిక్కక.. తాను ఎలాంటి నిర్ణయం తీసుకో లేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కేసీఆర్ కాళేశ్వరం విచారణకు హాజరు తరువాత కవిత విషయం లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

## లడ్డూలు, బ్రేక్, వసతి టికెట్లు మరింత సులభంగా - తిరుమలలో కొత్తగా 20 చోట్ల..!



అమరావతి : తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ నిర్ణయాలు తీసుకుంటోంది. బ్రేక్ దర్శనాల మార్పు తరువాత సాధారణ భక్తుల దర్శన సంఖ్య పెరిగినట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు. సాంకేతికత వినియోగించి క్యూ లైన్ల నిర్వహణ.. దర్శనాల సంఖ్య మరింత సులభతరం చేసేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. ఇదే సమయంలో తిరుమల కు వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదంతో పాటుగా.. విరాళాలు, అదే విధంగా బ్రేక్ దర్శన టికెట్ల కు వినియోగించేలా కొత్త విధానం అందుబాటులోకి తీసుకొచ్చారు తిరుమలలో సాంకేతికత ద్వారా భక్తులకు సేవలను సులభతరం చేసేందుకు టీటీడీ వరుస నిర్ణయాలు తీసుకుంటోంది. టీటీడీలో కియోస్క్ (సెల్ఫ్ ఆపరేటెడ్ మిషన్) యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్కల ఏర్పాటు చేసారు. కియోస్కల సాయం తో భక్తులకు టీటీడీ సేవలు సులభంగా అందుతున్నాయి. పైగా బోలెడంత సమయం ఆదా అవుతోంది. దీంతో ఈ కియోస్కలను విరివిగా వినియోగించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు హుండీ ద్వారా కాకుండా విరాళాలు ఇవ్వాలంటే పెద్ద తతంగమే ఉండేది. రూ.లక్షకుపైగా విరాళాలు ఇవ్వాలంటే దాతల విభాగానికి చేరుకుని, అక్కడ అన్ని వివరాలూ తెలియజేసిన తర్వాతే విరాళాలు తీసుకునేవారు. రూ.లక్షలోపు విరాళాలకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసినప్ప టికీ అక్కడ వివరాలు నమోదు చేయడం, కార్డు లేదా నగదుతో విరాళాలు చెల్లించడం వంటి ప్రక్రియతో భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో రూ.లక్షలోపు విరాళాలిచ్చే భక్తులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తొలిసారిగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈ కియోస్క్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు దీనిలోని క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి యూపీఐ ద్వారా రూ.లక్షలోపు ఎంతైనా విరాళంగా అందించవచ్చు. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో టీటీడీ ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్క్ లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఇప్పటివరకు రూ.4 కోట్ల విరాళాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మరికొన్ని సేవల్లోకి కియోస్క్ లను ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే లడ్డూలు పొందే భక్తులకూ కియోస్క్ లు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ మిషన్ల ద్వారాలడ్డూ ఆప్షన్‌లోకి వెళ్లి కావాల్సిన లడ్డూ సంఖ్యను టైప్ చేసి యూపీఐ ద్వారా నగదు చెల్లిస్తే ఓ రసీదు వస్తుంది. ఆ రసీదును లడ్డూ కౌంటర్‌లో చూపించి లడ్డూలు పొందవచ్చు. తద్వారా భక్తుల నిరీక్షణ సమయం తగ్గుతుందని టీటీడీ భావిస్తోంది. ఈ కియోస్క్ లో వీఐపీ బ్రేక్ టికెట్లను కూడా సులభతరంగా పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉండే ఈ కియోస్క్ మిషన్‌లో బ్రేక్ దర్శన టికెట్ ఆప్షన్‌లోకి వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ నంబరును ఎంట ర్ చేసి పేమెంట్ చేస్తే టికెట్ ప్రింట్ ఇస్తుంది. దీంతో భక్తులు వారు బస చేసే అతిథి గృహాలు, కాటేజీల్లోనే సులభంగా టికెట్లు పొందవచ్చు. ఇలా పలు విభాగాల్లోకి కియోస్క్ ను ప్రవేశపెట్టి భక్తులకు సులభతరంగా సేవలు అందించాలని టీటీడీ ప్రణాళిక రూపొందిస్తోంది. ఇవి అందు బాటులోకి రావటం ద్వారా భక్తులకు సేవలు మరింత సులభతరం కానున్నాయి.

## పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అర్థింపు

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదుల నరమేధానికి భారత్.. ప్రతీకారం తీర్చుకుంటోన్న ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్తాన్ సంచలన ప్రకటన చేసింది. సైనిక చర్యతో పాటు అంతర్జాతీయ వేదికలపై పాక్ దురాగతాలను భారత్ బట్టబయలు చేస్తోన్న నేపథ్యంలో అనూహ్య నిర్ణయాన్ని తీసుకుంది. భారత్ తో శాంతి చర్చలకు సిద్ధమని పాకిస్తాన్ వెల్లడించింది. జమ్మూ కాశ్మీర్, ఉగ్రవాదం సహా అన్ని అంశాలనూ చర్చల ద్వారా, శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. సంవత్సరాల తరబడి కొనసాగుతూ వస్తోన్న ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి సుముఖతను తెలియజేసింది. ఈ విషయాన్ని స్వయానా ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఉగ్రవాదం, సరిహద్దుల్లో చొరబాట్లు, వాణిజ్యం, ఇండస్ వాటర్ ట్రీటీ.. వంటి ఇతరత్రా అంశాలపై భారత్ తో కొనసాగుతున్న వివాదాలను పరిష్కరించుకోవాలని భావిస్తోన్నామని, చర్చల ద్వారానే అది సాధ్యపడుతుందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్ లోని అమెరికా రాయబార కార్యాలయం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో షరీఫ్ పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రవాదుల దాడి తరువాత భారత్–పాకిస్తాన్ మధ్య తలెత్తిన యుద్ధ వాతావరణాన్ని నియంత్రించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవ చూపారని ప్రశంసించారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకరించారని పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

న్యూఢిల్లీ : రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్–2025 టైటిల్ గెలుచుకున్న సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన =జదీ విజయోత్సవ సంబరాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు అభిమానులు వేల సంఖ్యలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్దకు తరలివచ్చారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగి 11 మంది మరణించారు. మరికొంతమంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తాజాగా ఈ ఘటనపై కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య అధికారిక ప్రకటన చేశారు. ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందారని తెలిపారు. ఆస్పతుల్లో క్షతగాత్రులతో మాట్లాడిన తర్వాత ఆయన మీడియా ముందు తొక్కిసలాటకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేశారు. "తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా జరగడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు పరిహారం ప్రకటిస్తున్నాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తాం. మరణించినవారిలో యువత ఎక్కువగా ఉన్నారు. చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35వేలు అయితే దాదాపు 2 లక్షల మంది వచ్చారు. దీంతో తొక్కిసలాట జరిగింది" అని కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ఈ విషయం చాలా బాధ కలిగించింది. నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



## కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం.. ఈ రాష్ట్రాలకు బిగ్ షాక్..?



